అందరూ ఊహించినట్టుగానే వైసీపీ మూడో జాబితాలో ఏలూరు పార్లమెంటు స్థానానికి ఇన్‌చార్జిగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు సునీల్‌కుమార్‌కు అవకాశం ఇచ్చింది. ఆయనకు కడప బంధుత్వం కలిసి వచ్చింది. చింతలపూడి ఇన్‌చార్జిగా మండలి చైర్మన్ మోషేన్‌రాజు వియ్యంకుడు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కె.విజయరాజును నియమించింది. ఒక్క నరసాపురం పార్లమెంటు మినహా మిగతా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్దగా మార్పులు, చేర్పులు ఉండబోవని సరికొత్త సంకేతాలు ఇచ్చేశారు.

# కలిసొచ్చిన కడప బంధుత్వం!







- ఏలూరు లోక్‌సభ ఇన్‌చార్జిగా సునీల్‌కుమార్
- మంత్రి కారుమూరి తనయుడికే అవకాశం
- చింతలపూడి ఇన్‌చార్జ్‌గా విజయరాజుకు ఛాన్స్
- వైసీపీ మూడో జాబితాలో అనూహ్య పరిణామాలు
- మిగతా స్థానాల్లో సిట్టింగులంతా ఇప్పటికి సేఫ్ !
- నూజివీడు టీడీపీ నుంచి పార్థసారథికి లైన్ క్లియర్ !

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి తాను పోటీ చేసేది లేదని సిట్టింగ్ ఎంపీ కోటగిరి శ్రీధర్ అధిష్టానానికి స్పష్టం చేశారు. ఇక ఆయన స్థానంలో బీసీ అభ్యర్థిని రంగంలోకి దింపాలని భావించిన పార్టీ ఆ దిశగా కసరత్తు చేసింది. జోగి రమేష్ పేరు ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. ఆయనను పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. ఏలూరు నుంచి యాదవులకు అవకాశం ఇవ్వాలని, ఈ సామాజిక వర్గానికి చెందిన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేరును తొలుత ప్రతిపాదించారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గంలో వున్న యాదవుల ఓట్లతోపాటు పార్టీకి అనుకూలంగా వున్న ఓట్ల వివరాల తీసివేతలు, కూడికలు తర్వాత సర్వే చేశారు. బీసీ మంత్రం పటిస్తున్నారు కాబట్టి నాగేశ్వరరావు వైపే మొగ్గు చూపారు. కాని దీనికి కారుమూరి నిరాకరిస్తూనే తన కుమారుడు సునీల్‌కు తణుకు సీటు ఇవ్వాలని అధిష్టానాన్ని అభ్యర్థించారు. పార్టీలో తన రాజకీయ గురువుల ద్వారా జగన్ చెవిన వేశారు. దీంతో ఇక కొత్త ముఖం తప్పనిసరి అని అందరూ భావిస్తుండగా కారుమూరి తనయుడు సునీల్ కుమార్‌ను ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఇన్‌చార్జిగా నియమిస్తూ తద్వారా వచ్చే ఎన్నికల్లో ఆయనే అభ్యర్థిగా వైసీపీ చెప్పకనే చెప్పింది. ఎంపీ స్థానానికి పోటీ చేసేందుకు ఎవరూ అనుకూలత చూపించకపోవడం, పార్టీ ఆశిస్తున్నట్టు ఎన్నికల పెట్టుబడి లెక్కలపై వెనుకంజ వేశారు. చివరకు సునీల్ వైపు మొగ్గు చూపారు. ఆయనకు 'కడప బంధుత్వం' కలిసి వచ్చినట్లు చెబుతున్నారు. మామ బిల్డర్ కావడం, తన భార్య వైపు బంధువుల సాన్నిహిత్యం కలిసి ఉండడం ఆయనకు కలిసి వచ్చింది. అనూహ్య పరిణామాల మధ్య సునీల్ అభ్యర్థిత్వానికి కొంత రిబేటు కూడా కలిసి వచ్చినట్లు చెబుతున్నారు.

## చింతలపూడికి విజయరాజు



చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తనకు మరోసారి ఛాన్స్ ఇవ్వాలంటూ పదే పదే పార్టీ అధినాయకత్వాన్ని ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజా విఫలమయ్యారు. దీంతో ఆయన స్థానంలో రవాణ శాఖ మాజీ ఉద్యోగి కె.విజయరాజును ఇన్‌చార్జిగా నియమించారు. పక్షం రోజుల ముందే విజయరాజు పట్ల సానుకూలంగా సంకేతాలు ఇచ్చినా ఒకటి, రెండు అంశాల విషయంలో పదేపదే నియోజకవర్గాల నుంచి వివరాలు రాబడుతూ వచ్చారు. తుదకు అందరూ ఊహించినట్టుగానే విజయరాజు నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. కామవరపుకోట మండలానికి చెందిన విజయరాజు అన్ని పార్టీల నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇది కూడా ఆయన ఇన్‌చార్జిగా నియామకానికి ప్లస్ మార్కుగా నిలిచింది. మరోవైపు తన వియ్యంకుడు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కావడం కూడా కలిసి వచ్చినట్లు చెబుతున్నారు. ఈ నియామకం తర్వాత ఎమ్మెల్యే ఎలీజా అందుబాటులో రాలేదు.

## పార్థసారథికే నూజివీడు టీడీపీ టిక్కెట్

మచిలీపట్నం లోక్‌సభకు పోటీ చేయాలని సీఎం జగన్ పదే పదే చెప్పినా పెనమలూరు ఎమ్మెల్యే మాజీ మంత్రి కొలుసు పార్థసారథి అంగీకరించడం లేదు. పెనమలూరు మినహా మరెక్కడా పోటీ చేయనని సోమవారం ముఖ్యమంత్రికే చెప్పి వచ్చారు. మంగళవారం పార్థసారథితో ఎంపీ అయోధ్యరామిరెడ్డి సుదీర్ఘంగా మంతనాలు జరిపినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆయన టీడీపీ తరపున నూజివీడు బరిలో నిలిపేందుకు లైన్ క్లియర్ అయినట్లు సమాచారం. తెలుగుదేశం ముఖ్యనేతలు పార్థసారథితో ఇప్పటికే మంతనాలు జరిపారు. దాదాపు ఒక కొలిక్కి వచ్చింది. దీనిపై ఒకటి రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## ఇక మార్పులు ఉండకపోవచ్చు !

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మినహా మిగతా నియోజకవర్గాలన్నింటిపైనా వైసీపీ క్లారిటీగా ఉందని, ఇకపై పెద్దగా మార్పులు, చేర్పులు ఉండబోవని ఆ పార్టీ నేతలు కొందరు అంచనా వేస్తున్నారు. అయితే అప్పటికప్పుడు అనూహ్య నిర్ణయాలు తీసుకోవడంలో వైసీపీ పెట్టింది పేరని, ప్రస్తుతానికి తామంతా సేఫ్ పొజిషన్‌లోనే ఉన్నామని వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఇన్‌చార్జిలుగా ప్రస్తుతం నియామకమైన వారి విషయంలోను తుది వరకు అనూహ్య సంఘటనలు ఏమీ లేకపోతే యధావిధిగానే వారు ఎన్నికలకు సిద్ధమవుతారని ఇంకొందరు భావిస్తున్నారు.

## 29న చంద్రబాబు 'రా కదలిరా' సభ



భీమడోలులో సభా వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న గన్ని వీరాంజనేయులు, టీడీపీ నాయకులు

భీమడోలు, జనవరి 11 : తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 29న ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు రానున్నారు. 'రా కదలిరా' బహిరంగ సభకు హాజరుకానున్నారు. గురువారం సభా ప్రాంగణాన్ని ఏలూరు టీడీపీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పరిశీలించారు. సభ నిర్వహణ కోసం భీమడోలు హైస్కూలు ఎదురుగా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని, హెలిప్యాడ్ కోసం శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. గన్నితో పాటు రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, స్థానిక టీడీపీ నాయకులు పరిశీలించారు. అంతకు ముందు భీమడోలు క్యాంపు కార్యాలయంలో ముఖ్య నేతలతో గన్ని సమావేశం నిర్వహించారు. వైసీపీ పాలనలో అన్యాయాలను,అక్రమాలను ఎత్తి చూపేందుకు రా.కదలిరా నిర్వహిస్తున్నారన్నారు.

## తాడేపల్లిగూడెంలో అర్బన్ రీసర్వే పూర్తి : జేసీ

భీమవరం, జనవరి 11: దేశంలోనే తొలి పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన తాడేపల్లిగూడెం అర్బన్ రీ సర్వే పూర్తయిందని జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి చెప్పారు.గురువారం జేసీ ఛాంబరులో ఆర్డీవో కె.చెన్నయ్య, జిల్లా సర్వే అధికారి జాషువా తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. పూర్తయిన దస్త్రాలను, మ్యాప్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.12వ తేదీ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చెయ్యడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనరు శామ్యూల్, తహసీల్దారు శివశంకర్, కలెక్టరేట్ ల్యాండు తహసీల్దారు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు పచ్చ జెండా



**నరసాపురం టు హుబ్లీ..**
**నేడు ప్రారంభించనున్న మంత్రి కిషన్‌రెడ్డి**
**ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన**

నరసాపురం, జనవరి 11: ఎట్టకేలకు అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు పచ్చజెండా ఊపనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గుంటూరు నుంచి రిమోట్ ద్వారా వర్చువల్‌గా ఈ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్నారు. నరసాపురంలో ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, విజయవాడ రైల్వే డీఆర్ఎం, జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్సీలు పాల్గొని ప్రారంభిస్తారు. చాలా ఏళ్లుగా ఈ ఎక్స్‌ప్రెస్ విజయవాడ నుంచి నడుస్తోంది. నరసాపురం-విజయవాడ మధ్య డబ్లింగ్ లైన్ పూర్తికావడంతో గతేడాది నవంబర్‌లో ఈ ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడిగించారు. ఈ ఏడాది జనవరిలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ప్రయత్నించారు. అయితే మంత్రి బీజీగా ఉండటంతో ఏడాదిగా ఈ రైలుకు మోక్షం కలగలేదు. విజయవాడ నుంచి నడుస్తోంది. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై రైల్వే అధికారులతో పాటు జిల్లా బీజేపీ నాయకులు కూడా స్పందించారు. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం కిషన్‌రెడ్డి గుంటూరులో షెడ్యూల్ సమాయానికి రిమోట్ కంట్రోల్ ద్వారా రైలును ప్రారంభించనున్నారు.

### షెడ్యూల్ ఇలా..

ఈ రైలు 17225 నంబర్‌తో మధ్యాహ్నం 3 గంటలకు నరసాపురంలో బయ లుదేరి విజయవాడ, గుంటూరు, మార్కాపురం, నంద్యాల, గుంతకల్, బళ్లారి, హోస్పేట మీదుగా మరుసటి రోజు ఉదయం 11.20కి హుబ్లీ చేరుకుంటుంది. తిరిగి 1.20లకు 17226 నంబర్‌తో హుబ్లీలో బయలుదేరి మరుసటి ఉదయం 7 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విజయ వాడకు 5.15 గంటలకు వస్తుంది. జిల్లాలో పాలకొల్లు, భీమవరం టౌన్, జంక్షన్, ఆకువీడు, కైకలూరు స్టేషన్లలో ఆగనుంది.

### గోవా వెళ్లేవారికి..

గోవా వెళ్లే ప్రయాణికులు నేరుగా ఈ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లవచ్చు. కొన్ని బోగీలు హుబ్లీలో వేరు చేసి హైద్రాబాద్ నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్‌కు జత చేస్తారు. తిరుగు ప్రయాణంలోనూ గోవాలో హైద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు జత చేసి హుబ్లీలో వాటిని అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు కలుపనున్నారు. దీనివల్ల రైలుమారే అవకాశం ఉండదు. జిల్లా నుంచి కర్ణాటక, రాయలసీమ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ రైలు సౌకర్యవంతంగా ఉంటుంది.

## అంగన్‌వాడీలకు నోటీసులు

భీమవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఎస్మా ప్రయోగించిన ప్రభుత్వం ఇప్పుడు నోటీసులు జారీచేసింది. జిల్లాలో 1556 అంగన్‌వాడీ కేంద్రాలు, 70 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 3,200 మంది విధులు నిర్వహిస్తున్నారు. వారందరికీ నోటీసులు పోస్టులో పంపారు.కార్యకర్తల ఇళ్లకు నోటీసులు అంటించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నోటీస్ బోర్డులోనూ పెట్టారు. దీనిపై అంగన్‌వాడీలు విరుచుకుపడుతున్నారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నోటీసులు జారీచేయడాన్ని తప్పుపడుతున్నారు.



నోటీసులు నాలుక గీసుకోవడానికి కూడా పనికిరావంటూ వీరవాసరంలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

### ప్రభుత్వం మేల్కొనాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**

ఏలూరు కలెక్టరేట్, జనవరి 11: 'అంగన్‌వాడీల నిరవధిక సమ్మె రాజకీయ పోరాటంగా మారకముందే ప్రభుత్వం మేల్కొని సమస్యలు పరిష్కరించాలి. లేకుంటే పండుగ అనంతరం ఉద్యమం రాజకీయరూపం తీసుకుంటుంది' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కలెక్టరేట్ వద్ద జరుగుతున్న 31వ రోజు సమ్మెకు, 6వ రోజు 24 గంటల దీక్షలకు సంఘీభావంగా గురువారం ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల ఓర్పు, సహనానికి పరీక్ష పెట్టొద్దని వారి ఆగ్రహంతో కొట్టుకుపోవద్దని హితవు పలికారు.అంగన్‌వాడీలు చేస్తున్న ఆకలి పోరాటాన్ని అర్థం చేసుకోకుండా నిరంకుశంగా వ్యవహరించడం తగదన్నారు. సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, డీఎన్‌వీడీ ప్రసాద్, కె.విజయలక్ష్మి, వి.సాయిబాబు, హైమావతి, రజినీ, బేబిరాణి, శాంతి, పుష్పరాజ్యం, జయసుధ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి : కలెక్టర్

భీమవరం, జనవరి11 : సంప్రదాయాలకు ప్రతీక, తెలుగు వాళ్ల అతి పెద్ద పండుగ సంక్రాంతి అని.. కుటుంబ సభ్యులందరూ ఒకచోట చేరి ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకుంటారని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ ట్రెజరీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ప్రారంభించారు.జిల్లా ట్రెజరీ అధికారి ఆడారి గణేష్ ఆధ్వర్యంలో సంప్రదాయం ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించడాన్ని అభినందించారు. మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగవల్లులు, బొమ్మల కొలువు, భోగి మంట, ధాన్యపు కంకులు, రేగిపళ్ళు మొదలైన వాటితో తీర్చిదిద్దారు. సంక్రాంతి వంటలైన కొబ్బరి అన్నం, పులిహోర, పెరుగు ఆవడ, అరిసెలు, బూరెలు, గారెలు, బొబ్బట్లు, కాజాలు, సున్నుండలు, లడ్డూలు పూత రేకులు, కజ్జికాయలు, జంతికలు, అప్పడాలు, ఉలవచారు, పచ్చిపులుసు, రోటి పచ్చడి మొదలైన పిండివంటలను సిబ్బంది స్వయంగా తయారుచేసి ఆహూతులకు సంక్రాంతి విందు ఏర్పాటు చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, డీపీఆర్వో నాగేశ్వరరావు, డీఎల్‌డీవో అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.



బొమ్మల కొలువు ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



## ఎన్నికల..బదిలీలు

**పోలీస్‌శాఖలో 37 మంది సీఐల ట్రాన్స్‌ఫర్**
**నేడే రేపో ఎస్ఐల బదిలీలకు రంగం సిద్ధం**

ఏలూరు క్రైం, జనవరి 11 : సార్వత్రిక ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అంతా చకచకా తమ పనులను కానిచ్చేస్తోంది. నిష్పక్ష పాతంగా ఎన్నికలు నిర్వహించడానికి , ఏ అధికారికి ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా విధులను నిర్వర్తించడానికి ఏకంగా అధికారులను జిల్లాలే మార్చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం పక్కా ప్రణాళిక సిద్ధం చేసి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్, ఎస్పీ స్థాయి నుంచి ఎస్ఐ స్థాయి అధికారి వరకూ ఈ ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో తమ పరిస్థితి ఏమిటని ఏ జిల్లాకు వెళ్తామో అన్న ఆలోచనలో ఉద్యోగులు పడ్డారు. పోలీస్ శాఖలో దీనిపై మరింత తీవ్ర చర్చ సాగుతోంది. ఎందుకంటే ప్రజా ప్రతినిధుల సిఫార్సులతోనే చాలామంది తమ పోస్టులను దక్కించుకుని అక్కడ అధికారాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో జిల్లా దాటి మరో జిల్లాకు వెళ్లిపోవాల్సిందేనని ఎన్నికల కమిషన్ హుకుం జారీ చేయడంతో కొంతమంది అయోమయంలో పడ్డారు. ఎన్నికల కోడ్ పూర్తి అయ్యేవరకూ మాత్రమే ఈ బదిలీలు అని ఆ ఉత్తర్వుల్లో లేకపోవడంతో డీలాపడ్డారు. ఇప్పుడు బదిలీ చేస్తే మరో మూడేళ్ల అక్కడే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉండడంతో ఏమి చేయాలా అని ఆలోచనలో పడ్డారు. కలెక్టర్ నుంచి ఎస్ఐ స్థాయి వరకూ అధికారులు సొంత జిల్లాలో ఎట్టి పరిస్థితిలో పనిచేయకూడదని 2024 జూన్ 30 లోపు ఆ జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తయితే వారిని వేరే జిల్లాకు బదిలీ చేయా లని స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే ప్రస్తుతం 26 జిల్లాలు ఉన్నాయి. కానీ పూర్వం ఉన్న 13 జిల్లాలనే పరిగణలోకి తీసుకుని ఈ బదిలీలు కొనసాగించాలనడంతో మూలిగేనక్కపై తాటికాయ పడ్డట్లుగా కొంత మంది అధికారుల పరిస్థితి ఉంది. పోలీస్ శాఖలో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల బదిలీలు ఈనెల 8వ తేదీ చేపట్టారు. ఏలూరు రేంజ్ పరిధిలో 33 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. ఇంకా కొంతమంది సీఐలు బదిలీ కావాల్సి ఉంది. పశ్చిమ గోదావరి జిల్లాల్లో నలుగురిని బదిలీ చేశారు. ఈ బదిలీల తర్వాత ఆయా జిల్లాల ఎస్ఐల వంతు మిగిలింది. కేంద్ర ఎన్నికల సంఘం మరోమారు రాష్ట్రానికి ఈనెల 9, 10 తేదీల్లో విజయవాడలో కలెక్టర్, ఎస్పీలతో సమా వేశం నిర్వహించి ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలపై కలెక్టర్, ఎస్పీలు ఏ చర్యలు తీసుకున్నారో వంటి వివరాలు తెలుసుకు న్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు బదిలీ ప్రక్రియ చకచకా చేసేస్తున్నారు. జిల్లాలో పనిచేసే ఎస్ఐలలో పలువురిని బదిలీ చేయడానికి ఇప్పటికే రంగం సిద్ధం చేశారు. నేడే రేపో ఏలూరు జిల్లాలో 13 మంది ఎస్ఐలకు జరుగుతాయని సమాచారం. గతంలో లా అండ్ ఆర్డర్‌తో సంబంధం ఉన్నవారిని మాత్రమే ఈ బదిలీల ప్రక్రియలో తీసుకున్నారు. ఇప్పుడు అలాంటివి ఏమీ లేకుండా అధికారి ర్యాంక్‌ను మాత్రమే చూపించారు. దీంతో లూపులైన్లో పనిచేసే పోలీసు అధికారులు సైతం వేరే జిల్లాకు బదిలీ కావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



# హరివిల్లు.. సిరిజల్లు..

## వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయుగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

**ద్వితీయ బహుమతి విజేతలు**

### ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

### రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

### పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు





**విజేతలు వీరే..** బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

# ఉమ్మడిగా తేల్చుదాం

- బీజేపీయేతర పక్షాలతోనే ఎన్నికల ముడి
- మరింత బలమైన ఉద్యమాలు చేద్దాం
- ఇక తాడోపేడో తేల్చేద్దాం
- జగన్ సర్కార్‌పై అన్ని చోట్ల భారీ వ్యతిరేకత
- అంగన్‌వాడీలకు అండగా నిలబడదాం : సీపీఎం నిర్ణయం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

'రాబోయే ఎన్నికల్లో పోటీకి వీలుగా ముందుగా సీపీఐతో మాట్లాడుకుందాం. పరస్పరం చర్చించిన తరువాతే మిగతా పార్టీల సంగతి చూద్దాం. అంతకంటే మించి వైసీపీపై వ్యతిరేకత తీవ్రంగా ఉంది. ఈ అంశాలన్నింటినీ ఎక్కడికక్కడ సరి చూసుకుని ముందడుగు వేద్దాం.' అని రెండు రోజులపాటు ఏలూరులో జరిగిన సీపీఎం కార్యవర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయమిది. పలు రాజకీయ అంశాలు, ప్రస్తుత స్థితిగతులు అంతకంటే మించి మార్పులు, చేర్పులు, ఆందోళనలు అన్నిటిపైనా రాష్ట్ర కార్యవర్గం సమగ్రంగా చర్చించింది. కీలక అంశాలపై సుదీర్ఘ చర్చ సాగింది. ప్రత్యేకించి రాజకీయ అంశాలతోపాటు అంగన్‌వాడీ ఆందోళనలపైనా ప్రధాన దృష్టి పెట్టాల్సిందేనని ఏకాభిప్రాయం వెలువడింది. ఆ మేరకు సీపీఎం రాజకీయ అంశాలకు ఎక్కువ సమయం కేటాయించలేదు. ఎలాగూ ఎన్నికల కాలం వచ్చేసింది కాబట్టి ఒక వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని తొలుత వామపక్షాల్లో భాగమైన సీపీఐతో నేరుగా చర్చించాలని, అదికూడా ఎప్పుడు వీలైతే అప్పుడే రంగంలోకి దిగాలని ఒక నిర్ణయానికి వచ్చారు. ఇంతకుముందు సార్వత్రిక ఎన్నికల్లో అప్పట్లో జనసేనతో మిత్రత్వం ఉండేది. ఈసారి మారిన రాజకీయ పరిస్థితులు కారణంగా ఆచితూచి నిర్ణయా లకు సంసిద్ధం కావాల్సిందేనని మరో నిర్ణయానికి వచ్చి బీజేపీయేతర లౌకిక శక్తులను కూడాగట్టుకోవాలని పార్టీ నిర్ణయించింది. ఎందుకంటే మొదటి నుంచి మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్నందున ఇదే మేలైన మార్గంగా అనుసరించాలని, వీలైతే ఇతర పార్టీలతోను సమయం, సందర్భాలను బట్టి మాట్లాడాలని యోచించారు. కాంగ్రెస్ పరిణామాలను కూడా చర్చిస్తూ ఆ పార్టీ ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న పరిణామాలను క్షుణ్ణంగా గమనించే ఒక నిర్ణయా నికి రావాలని భావిస్తున్నారు. షర్మిల కాంగ్రెస్‌లో ప్రవేశాన్ని స్వాగతించడం మరో పరిణామం.

టీడీపీ, జనసేన, వైసీపీ వంటి ప్రధాన పార్టీలన్నీ బీజేపీతో జతకట్టడాన్ని సమావేశంలో తప్పుపట్టారు. ఈ కారణంగా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరగడమే కాకుండా కార్పొరేట్ పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నారని సమావేశం భావించింది. అంతకంటే మించి రాజకీయ అంశాలను సావధానంగా పరిష్కరించుకోవడంతోపాటు ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్లే క్రమంపైనే ఎక్కువగా చర్చించారు. ఈ పరిస్థితులన్నింటిపైనా ఎప్పటికప్పుడు సమన్వయప ర్చుకుని మిగతా పార్టీలతో మాట్లాడాలని నిర్ణయించారు. మిగతా పార్టీలను అంగన్‌వాడీ సమస్యలపై పూర్తిగా కలుపుకుపోవడంతోపాటు ప్రత్యేక ఉద్యమానికి సన్నద్ధమయ్యేలా సర్కార్ దిగి వచ్చేంత వరకు దీనిని కొనసాగించాలని నిర్ణయించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సర్కార్ దిగి వచ్చేంత వరకు వెనక్కి తగ్గకుండా రాజీలేని ఆందోళనలు కొనసాగించాలని కూడా సీపీఎం నిర్ణయించింది. ప్రత్యేక పరి స్థితులను అధ్యయనం చేయడం, పార్టీ విధానాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసు కోవడం జరగాలన్నదే కార్యవర్గ ముఖ్య ఉద్దేశంగా భావిస్తున్నారు. రెండు రోజుల పాటు సాగిన కార్యవర్గంలో ఏకబిగిన ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా చర్చించి ఆమోదిం చడమే కాకుండా భవిష్యత్ కార్యాచరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాంతో సహా మిగతా నేతలంతా పార్టీ తీసుకున్న నిర్ణయాలపై గురువారం మీడియాతో కూడా మాట్లాడారు.



**క్రైం కార్నర్**

# వేర్వేరుచోట్ల ఆరుగురి మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గురువారం వేర్వేరుచోట్ల ఆరుగురు మృతి చెందారు. కారు ఢీకొని దంపతులు, చికిత్స పొందుతూ ఇద్దరు, ఉరేసుకుని వృద్ధుడు, విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందారు.

### బంధువుల ఇంటికొచ్చి వెళ్లిన కొద్దిసేపటికే..

- హైవేపై బైక్‌ను ఢీకొన్న కారు.. దంపతులు మృతి



ప్రమాదానికి కారణమైన కారు

ఏలూరు క్రైం, జనవరి 11 : బంధువుల ఇంటికి వచ్చి వారితో సరదాగా మాట్లాడి ఆ తరువాత వెళతామని చెప్పిన కొద్ది సేపటికే ఆ దంపతులు అనంతలోకాలకు వెళ్లిపోయా రు. పెదవేగి మండలం మొండూరు పంచాయతీ అంకంపాలెంకు చెందిన చౌటుపల్లి రాటాలు(52), ఆయన భార్య అమ్మాజీ(48) కూలిపనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా వివాహాలు చేశారు. గురువారం సాయంత్రం ఏలూరు సమీపంలోని దుగ్గిరాలలో ఉన్న బంధువుల ఇంటికి వారిద్దరూ కలిసి బైక్‌పై వచ్చి వారితో కాసేపు సంతోషంగా గడిపారు. అనంతరం ఇంటి నుంచి బయలు దేరి జాతీయ రహదారిపై దుగ్గిరాల బ్రిడ్జి వద్ద నుంచి ఆశ్రం వైపు వెళ్తుండగా మార్గమధ్యలో చొదిమెళ్ళ బ్రిడ్జిపై విజయవాడ వైపు నుంచి వెనుక వస్తున్న కారు అతివేగంగా బైక్‌ను ఢీకొనడంతో వీరిద్దరూ ఎగిరి చెల్లాచెదురుగా పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు, ఏలూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ కారులో వారు హైదరాబాద్ నుంచి కాకినాడకు వెళ్తున్నట్టుగా గుర్తించారు. ఈ ఘటన బంధువులనే కాకుండా అంకంపాలెంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాద ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం ఆ రెండు మృత దేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించనున్నారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

టి.నరసాపురం, జనవరి11:ప్రమాదవశాత్తు మంటలంటుకుని గాయాల పాలైన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వెలగపాడుకు చెందిన కనిపెడ మంగమ్మ(58) ఈనెల 7న చలిమంట వద్ద కూర్చుని ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని గాయాలపాలైంది. ఈక్రమంలో ఆమెను ముందుగా జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కుమారుడు ఏసుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపారు.

### లారీ ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, జనవరి 11 : రోడ్డుదాటుతున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గుంటూరు జిల్లాకు చెందిన కొంతమంది వలస కూలీలు జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామానికి వచ్చి పొగాకు కొట్టు పనులకు వెళ్తున్నారు. గురువారం ఉదయం ఆ గ్రామ సెంటర్‌లో మురెడేపల్లి మరియదాస్ (40) రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికి మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

### ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

కలిదిండి, జనవరి 11 : తాగిన మైకంలో ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూల్లంక పంచాయతీ పరిధిలోని సత్య నారాయణ నగర్‌కు చెందిన సంగాని మోషే (65) బుధవారం రాత్రి తాగిన మైకంలో రామాలయం పక్కనే ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు కొంతకాలంగా భార్యపిల్లలకు దూరంగా ఉంటూ ఒంటరిగా జీవిస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు సంగాని శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.

### ఫ్లెక్సీ కడుతుండగా షాక్‌తో యువకుడి మృతి

ఆకివీడు, జనవరి 11: ఫ్లెక్సీ కడుతుండగా కరెంటు షాక్ కొట్టి ఓ యువకుడు చనిపోయిన ఘటన ఆకివీడులో జరిగింది. ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపిన వివరాలివి.. ఆకివీడు బైపాస్ రోడ్డులోని చర్చి వద్ద ఉంటున్న గొల్లారి దినేష్ (20) ఫ్లెక్సీలు కట్టేందుకు బుధవారం రాతిర పనికి వెళ్లాడు. ఫ్లెక్సీ కడుతున్న సమయంలో విద్యుత్‌షాక్ కొట్టడంతో ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తండ్రి శ్రీరామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### వరకట్న హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

ఏలూరు క్రైం/గణపవరం, జనవరి 11 :కట్నం కోసం భార్యను హింసిస్తూ మెడలో ఉన్న పసుపు తాడుతోనే మెడ బిగించి హతమార్చిన భర్తపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ ఏలూరులోని మొదటి అదనపు సెషన్స్ కోర్టు న్యాయా ధికారి రామ్‌గోపాల్ గురువారం తీర్పు చెప్పారు. దేవరపల్లి గ్రామానికి చెందిన చిమర్తి వరలక్ష్మి-మల్లయ్య(లేటు) దంపతుల కుమార్తె నంగాలమ్మ (20)ను గణపవరం మండలం పిప్పరకు చెందిన మేడా అబ్బులుకు ఇచ్చి వివాహం చేశారు. వారు పిప్పరలో రొయ్యల చెరువుపై కాపలా ఉంటున్నారు. ప్రతి రోజూ తాగి వచ్చి కట్నం కోసం నంగాలమ్మను అబ్బులు వేధించేవాడు. 2020 జూలై 18న తాగి వచ్చిన అబ్బులు భార్యను కొట్టి పసుపుతాడుతోనే మెడ బిగించి హతమార్చాడు. ఈ ఘటనపై నంగాలమ్మ తల్లి వరలక్ష్మి గణపవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ ఎం.వీరబాబు కేసు నమోదు చేయగా సీఐ భగవాన్‌ప్రసాద్ కేసు దర్యాప్తు చేసి హంతకుడైన అబ్బులును అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావ డంతో జీవిత కారాగార శిక్ష, రూ.1500 జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్-1 లక్ష్మణనాయక్ వాదించగా ప్రాసిక్యూష న్‌కు నిడమర్రు సీఐ ఎం.సుభాష్, గణపవరం ఎస్ఐ వి. వెంకటేశ్వరరావు, కోర్టు హెచ్‌సీ ఎన్.వేణుగోపాలరావు, జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు సహకరించారు.

### బీరు సీసాతో ఒకరిపై దాడి



గాయాలైన రంగబాబు

ఏలూరు క్రైం, జనవరి 11:ఇంటి ముందు ఎందుకు గొడవ చేస్తున్నారంటూ అడిగిన వ్యక్తిపై మరో వ్యక్తి బీరు సీసాతో దాడి చేసి గాయపర్చాడు. ఏలూరు అశోక్‌నగర్ ఏటిగట్టు ప్రాంతానికి చెందిన చెలికాని రంగబాబు ఇంటి ముందు బుధవారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన కీర్తి పుల్లారావు, నాని అనేవారు గొడవ పడుతుండగా రంగబాబు వెళ్లి తమ ఇంటి ముందు ఎందుకు గొడవ పడుతున్నారని ప్రశ్నించడంతో వారిద్దరు వెళ్లిపోయారు. ఆ తరువాత మళ్లీ కీర్తి పుల్లారావు వచ్చి రంగబాబును బయటకు పిలిచి బీరు సీసాతో దాడిచేసి కొట్టారు. గాయాలపాలైన రంగబాబును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మద్యం సీసాతో దాడి..ఒకరికి గాయాలు

భీమడోలు, జనవరి 11 : భీమడోలు మండలం పూళ్ళ గ్రామంలో ఇరువురి మధ్య ఉన్న తగాదాల నేపథ్యంలో మద్యం షాపులో గురువారం నూతులపాటి పాల్‌పై సిద్దాబత్తుల విఘ్నేష్ అనే వ్యక్తి ఖాళీ మద్యం సీసాతో దాడి చేశాడు. పాల్‌కు గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో ఏలూరు జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

### బ్యాంకు ఖాతాలో రూ. 68,450 మాయం

- లబోదిబోమంటున్న ఖాతాదారుడు.. పోలీసులకు ఫిర్యాదు

ఆచంట, జనవరి 11 : ఆచంట ఎస్‌బీఐ బ్రాంచిలోని ఒక ఖాతాదారుడి ఖాతాలో వున్న రూ.68,450 మాయమైన ఘటన జరిగింది. ఆచంట శివారు పెదపేటకు చెందిన నక్కా మోహనరావుకు చెందిన ఎస్‌బీఐ ఖాతా నుంచి డిసెంబరు 2 నుంచి 11 వ తేదీలోపు పలు దఫాలుగా డ్రా చేసినట్టు తెలిపాడు. పిల్లల చదువు నిమిత్తం ఖాతాలో ఎప్పుడూ రూ.50 వేలు ఉంటాయని.. ఈనెల 10న తన కుమారుడు సెల్‌ఫోన్ రీచార్జి నిమిత్తం డబ్బులు ఫోన్‌పే చేస్తుండగా ఖాతాలో డబ్బులు లేనట్టు చూపించడంతో అవాక్కయ్యాడు. వెంటనే బ్యాంక్ వద్దకు వెళ్లి విషయం తెలుపగా పలు దఫాలుగా విత్‌డ్రా చేసినట్టు బ్యాంక్ స్టేట్‌మెంట్‌లో నిర్ధారణైంది. ఖాతాదారుడితో పాటు బ్యాంకు మేనేజర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని బ్యాంక్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బ్యాంక్ అధికారులు ఎలా జరిగిందో దర్యాప్తు చేసి తన డబ్బులు వచ్చేలా చూడాలని ఖాతాదారుడు కోరుతున్నాడు.

### రేపటి నుంచి మావుళ్ళమ్మ ఉత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

భీమవరంటౌన్, జనవరి 11 :శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి 60వ వార్షిక జాతర ఈనెల 13 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 13న ఉదయం రామయాణం గోవిందరావు, వెంకటేశ్వరి దంపతులచే అమ్మవారికి కుంకుమపూజలు, కలశస్థాపనతో కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. ఉత్సవాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం కొటికలపూడి గోవిందరావు కళావేదికపై ఉత్సవాలను మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల ప్రారంభిస్తారన్నారు. వచ్చేనెల 6 వరకు ఏకధాటిన సాంస్కృతిక కార్యక్రమాలు, 7,8 తేదీలు విశ్రాంతి దినాలుగా ఉంటాయని 9న శుక్రవారం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తుటారపు ఏడుకొండలు, రామాయణం గోవిందరావు, కొప్పుల సత్యనారాయణ, రామాయణం చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి క్షేత్రానికి అమావాస్య ఎఫెక్ట్



నామమాత్రంగా క్యూలైన్‌లో వున్న భక్తులు

ద్వారకాతిరుమల, జనవరి 11 : శ్రీవారి క్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీపై అమావాస్య తన ప్రభావాన్ని చూపింది. ప్రతినిత్యం ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఈ గురువారం అమావాస్య కావడంతో ఆలయానికి వందల సంఖ్యలోనే యాత్రికులు తరలివచ్చారు. ఆలయంలోని అన్ని విభాగాలు దాదాపు ఖాళీగా కన్పించాయి. దేవస్థానం, ప్రైవేటు ఫాన్సీ దుకాణాలు మధ్యాహ్నం సమయానికి మూతపడ్డాయి.

**విలాస మండపంలో.. శ్రీవారికి ఉత్సవం**

శ్రీవారి క్షేత్రవిలాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవికి గురువారం ఉదయం జరిగిన ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా స్వామి, అమ్మవార్లను గోదాదేవితో కలసి తొళక్కవాహనంపై ఉంచి ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం క్షేత్రపురవీధుల్లో ఊరేగించారు. విలాసమండపంలో మూర్తులను ఉంచి అర్చకులు, ప్రత్యేక పూజలు జరిపి, హారతులు సమర్పించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

### 'లంపీస్కిన్' నివారణకు చర్యలు

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

ఆకివీడు, జనవరి 11: దూడలకు రోగనిరోధకశక్తి లేకే లంపీస్కిన్ వ్యాధి బారినపడి చనిపోతున్నాయని, ఈ వైరస్ అంటువ్యాధి కావడంతో పశుసంవర్థక రైతులు చికిత్స కంటే నివారణ చర్యలపై దృష్టిపెట్టాలని భీమవరం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ జవహర్ హుస్సేన్ స్పష్టం చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన ఉసురు తీస్తున్న లంపీస్కిన్ కథనంపై అధికారులు స్పందించి గోశాలలు పరిశీలించి మాట్లాడారు. గత ఏడాది సెప్టెంబరులో 1055 తెల్ల ఆవులకు ముద్దచర్మానికి సంబంధించి వ్యాక్సిన్ వేశామన్నారు. ఇటీవల గాలికుంటు టీకాలు 2,200 తెలుపు, నలుపు ఆవులకు వేశామన్నారు. ఈనెలాఖరు వరకు టీకాలు వేస్తారన్నారు. నెలకొకసారి తమ పరిధిలోని గోశాలలు పరిశీలించాలని ఏడీ జనార్దనరావుకు సూచించారు.

### గోవా మద్యం బాటిళ్లు స్వాధీనం.. ఒకరి అరెస్ట్

తణుకు, జనవరి 11 : వేల్పూరుకు చెందిన వ్యక్తి నుంచి గోవాకు చెందిన విస్కీ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గురువారం రూరల్ ఎస్ఐ కె.చంద్రశేఖర్‌కు వచ్చిన సమాచారం మేరకు వేల్పూరుకు చెందిన అయిశెట్టి పాపారావు అనే వ్యక్తి వద్ద గోవాకు చెందిన విస్కీ 25 ఫుల్ బాటిల్స్, 8 క్వార్టర్ బాటిల్స్ ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని తెలిపారు. ముద్దాయిని న్యాయమూర్తి ముందు హాజరుపర్చినట్టు చెప్పారు.

## జగనన్న తోడు రుణాలు అందజేత



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్

భీమవరం, జనవరి 11 : జగనన్న తోడు పథకం కింద ఇస్తున్న రూ. 10 వేల రుణం ద్వారా చిరు వ్యాపారుల్లో ఆత్మ గౌరవాన్ని పెంచుతుందని కలెక్టరు పి. ప్రశాంతి పేర్కొన్నారు. 8వ విడత వడ్డీ లేని రుణాలను అందించే కార్యక్రమాన్ని కలెక్టరేటు వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుంచి సీఎం ప్రారంభ కార్యక్రమాన్ని కలెక్టరు, ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు వర్చువల్‌గా తిలకించారు. 8వ విడత జగనన్న తోడు 30,077 మందికి రూ.78.61 కోట్ల నమూనా చెక్కును కలెక్టరు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

## డాక్టర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఫొటో ఎగ్జిబిషన్

భీమవరం, జనవరి 11 : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శనీయుడని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. అంబేడ్కర్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సామాజిక సమతా సంకల్పం (జన్ బాగీదరి) కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ జీవిత చరిత్రపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కలెక్టరు ప్రారంభించారు. అంబేడ్కర్ జీవితంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ముందుగా కలెక్టరేట్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి, సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, జేసీ ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు.

## కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీష్

నరసాపురం, జనవరి 11: సంప్రదాయ, క్రీడా ముసుగులో కోడి పందాలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో అంబరీష్ హెచ్చరించారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, మునిసిపాలిటీ తదితర శాఖల అధికారులతో డివిజన్‌స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కోడి పందాలకు, జూదాలు నిర్వహించేందుకు భూములు ఇచ్చి ప్రోత్సాహిస్తే వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కొప్పర్రులో తహసీల్దార్ ఫాజిల్ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో కోడి పందాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌యాదవ్, కమిషనర్ వెంకటేశ్వరావు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

**మొగల్తూరు:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందాలు, పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.అనిత కుమారి హెచ్చరించారు. మొగల్తూరులో గత ఏడాది నిర్వహించిన కోడి పందాల బరిలను సందర్శించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఆమె వెంట విఆర్వో సుభాషిణి, విఆర్ఏలు చంటి, గణేష్ ఉన్నారు.

## పెండింగ్ పనుల్ని వేగవంతం చేయాలి

నరసాపురం టౌన్, జనవరి 11: పట్టణంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆనంతరం స్మృతివనం, చినమామిడిపల్లిలో నిర్మాణంలో ఉన్న ఓహెచ్‌ఆర్ ట్యాంకు పనుల్ని పరిశీలించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ వెంకటేశ్వరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు అయోధ్య అక్షింతలు

భీమవరం టౌన్, జనవరి 11 : జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, జేసీ ఎస్.రామ సుందర్ రెడ్డిలకు అయోధ్యరాముని అక్షింతలు విశ్వ హిందూ పరిషత్ నాయకులు అందజేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం ఈనెల 22 మధ్యాహ్నం 12-20 గంటలకు జరగనుందని, దీనిలో భాగంగా శ్రీరాముని పూజ అక్షింతలు దేశ వ్యాప్తంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టామని విశ్వ హిందూ పరిషత్ నాయకులు తెలిపారు. ఈ అక్షింతలు ఈనెల 22న మధ్యాహ్నం 12-20 గంటలకు శిరస్సుపై వేసుకుని సాయంత్రం 5 గంటలకు ప్రమీదలను వెలిగించాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు వబిలిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, చెట్లపల్లి జగన్మోహన్, నేరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పెంటపాడులో అక్షింతల పంపిణీకి ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

**పెంటపాడు:** రెడ్డి యూత్ ఆధ్వర్యంలో అయోధ్య రామమందిర అక్షింతలను గురువారం పెంటపాడులో ఇంటింటికీ పంపిణీ చేశారు. సీతారాముల విగ్రహాలను పలకిలో ఊరేగించారు. సీతా, రామ లక్ష్మణ, హనుమ వేషధారణలో చిన్నారులు అలరించారు. నల్లమిల్లి గాంధీరెడ్డి, విజయానందరెడ్డి, కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, కర్రి గిరీష్‌రెడ్డి, కొవ్వూరి భాస్కరరెడ్డి, కొవ్వూరి లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

**పోడూరు:** పెనుమదంలో రామభక్తులు ఆధ్వర్యంలో చల్లాలమ్మ ఆలయం వద్ద నుంచి గ్రామంలో ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతలను భక్తులు పంపిణీ చేశారు. ఈనెల 22న ప్రతీ ఇంటా దీపం వెలిగించి రామభక్తిని చాటుకోవాలన్నారు.

## ఘనంగా బండారు జన్మదిన వేడుక



మాధవ నాయుడుకు కేక్ తినిపిస్తున్న అభిమానులు

నరసాపురం టౌన్, జనవరి 11: మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు జన్మదిన వేడుకల్ని గురువారం ఘనంగా నిర్వహించారు. రాయపేటలోని ఆయన నివాసంలో అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. పట్టణ, మండలం, మొగల్తూరు నుంచి పెద్ద ఎత్తున టీడీపీ అభిమానులు, అన్ని పార్టీల నాయకులు తరలివచ్చారు. మిత్రుడు రెబల్‌స్టార్ ప్రభాస్ ఉదయాన్నే ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకుడు శ్రీనివాసవర్మ జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. బండారు యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధులు, పేదలకు బట్టలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన నివాసం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో నరేంద్ర, బొమ్మిడి నాయకర్, చాగంటి చిన్న, డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, తమ్మిశెట్టి బాబీ, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ గణేష్, చల్లా దానయ్యనాయుడు తదితరులు ఉన్నారు.

## అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు హాజరు కావాలి

కాళ్ల, జనవరి 11 : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణకి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లి విజయవంతం చేయాలని వైసీపీ ఉండి ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు అన్నారు. పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పాలభిషేకం చేసి నివాళులర్పించారు.

## హామీలకు జీవోలు ఇవ్వాలి

తణుకు, జనవరి 11: ప్రభుత్వంతో గురువారం జరిగిన చర్చలతో మున్సిపల్ కార్మికులు తాత్కాలికంగా సమ్మె విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, యూనియన్ గౌరవాధ్యక్షుడు కామన మునిస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వ హామీలపై వెంటనే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రా..కదలిరా సభలు విజయవంతం: తోట

భీమవరం అర్బన్, జనవరి 11: టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ వైఫల్యాలపై నిర్వహించిన రా కదలిరా మహాసభలు విజయవంతం అయ్యాయని పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లను సమస్యలను రా కదలిరా బహిరంగ సభల ద్వారా ఎత్తి చూపారన్నారు. చంద్రబాబు బహిరంగ సభలకు లక్షలాదిగా వచ్చిన ప్రజలను చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు మొదలయ్యాయన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికలలో టీడీపీ-జనసేన పార్టీలు ఘనవిజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుమంట్ర, జనవరి 11 : విద్యుత్ మరమ్మతులు కారణంగా మార్టేరు, వెలగలేరు, నెగ్గిపూడి, సత్యవరం, పెనుమంట్ర పంచాయతీ నుంచి రాజీవ్ కాలనీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ బి.సురేష్ కుమార్ తెలిపారు.

## సంక్రాంతి సంబరాలు



జిల్లాలో విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం భీమవరంలోని డీఎన్‌ఆర్ కళాశాల.. నరసాపురం సూర్య విద్యా సంస్థ.. మార్టేరు లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో భోగి మంట వెలిగిస్తున్న డాక్టర్ భారత లక్ష్మి.. పెదతాడేపల్లిలో ముగ్గుల పోటీలు



బొండాడలో ఇంటింట ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రామరాజు.. నరసాపురంలో జయహో బీసీ సమావేశంలో మాట్లాడుతున్న పొత్తూరి.. తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న కన్వీనర్ వలవల బాబ్జి

# ‘బీసీల ప్రగతి టీడీపీతోనే సాధ్యం’

యలమంచిలి, జనవరి 11: బీసీల పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీయేనని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. స్థానిక కల్యాణమండపంలో గురువారం నిర్వహించిన జయహో బీసీ సమావేశంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీల రక్షణ చట్టం ద్వారా అన్నివిధాలా అండగా ఉండాలని టీడీపీ నిర్ణయం తీసుకుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకూ బీసీల ప్రగతి, అభ్యున్నతికి టీడీపీ చిత్తశుద్ధితో కృషిచేస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం 30 సంక్షేమ పథకాలను రద్దుచేసి బీసీలకు తీవ్ర అన్యాయం చేశాడని విమర్శించారు. ఆనాడు ఎన్టీఆర్ బీసీలకు స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. బీసీల ప్రగతి టీడీపీతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో కడలి గోపాలరావు, పెచ్చెట్టి బాబు, చిట్టూరి ఆంజనేయులు, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కోడి విజయభాస్కర్, మల్లాడి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ పాలనలో పేదలపై భారాలు

కాళ్ల జనవరి 11 : వైసీపీ పాలనలో అన్ని వస్తువుల ధరలు పెరగటంతో సామాన్య మధ్యతరగతి కుటుంబాల జీవనంపై తీవ్ర భారం పడిందని ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. బొండాడ, జక్కరం గ్రామాలలో రెండవ రోజు టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వం హయంలో మంజూరైన నిధులను సైతం ఈ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, గ్రామాధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ ఆరేటి తాతపండు, పెన్మెత్స సత్యనారాయణరాజు, రెడ్డిపల్లి జనార్దన్, కందుల అరవింద్, చెరుకువాడ రమేష్, జి ఫణీంద్ర, జి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

### ‘వైసీపీని తరిమికొడదాం’

నరసాపురం టౌన్, జనవరి 11: వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు బీసీలంతా ఏకం కావాలని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, జనసేన కన్వీనర్ నాయకర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని వీవర్స్‌కాలనీలో జయహో బీసీ సమావేశానికి అగ్నికులక్షత్రీయ రాష్ట్ర సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పొత్తూరి మాట్లాడుతూ బీసీలకు టీడీపీ అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిందని అన్నారు. జనసేన కన్వీనర్ నాయకర్ మాట్లాడుతూ వైసీపీ కేవలం బీసీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నదే తప్ప వారి అభ్యున్నతికి చేసింది ఏమి లేదన్నారు.

### చంద్రబాబుకు ప్రజల బ్రహ్మారథం

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 11: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సభలకు ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్ పాలనలతో ప్రజలు విసిగి పోయారన్నారు. చంద్రబాబును ఎప్పుడు సీఎంగా చూద్దామా అంటూ ఎదురు చూస్తున్నారన్నారు. గొర్రెల శ్రీధర్, పోతుల అన్నవరం, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, గంధం సతీష్, వాడపల్లి సుబ్బరాజు, ముత్యాల సత్యనారాయణ, సబ్బీసు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## చినఅమిరంలో సీసీ రోడ్లు ప్రారంభం

భీమవరం రూరల్, జనవరి 11 : చినఅమిరంలో సుమారు రూ.3కోట్ల 63 లక్షలతో నిర్మించిన 15 సీసీ రోడ్లను గురువారం ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించే డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొట్టుముక్కల సత్యనారాయణరాజు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తహసీల్దార్ వై.రవికుమార్ పాల్గొన్నారు. మండలంలో ఆదిత్యకాలేజీ నుంచి కొమరాడ, అనాకోడేరు వరకు రూ.3కోట్లతో నిర్మించే సీసీ, బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ గురువారం అనాకోడేరు గ్రామంలో శంకుస్థాపన చేశారు.

## సంక్రాంతి క్రికెట్ పోటీలు ప్రారంభం

భీమవరం టౌన్, జనవరి 11: డీఎన్‌ఆర్ కళాశాల గన్నాబత్తులవారి క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభించారు. మొదటి మ్యాచ్ డీఎన్‌ఆర్ లెవెన్ వర్సెస్ బీసీసీ లెవెన్స్ మధ్య జరిగింది. బీసీసీ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ తీసుకున్నారు. డీఎన్‌ఆర్ బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 126 పరుగులు చేసి 7వికెట్లు కోల్పోయారు. అనంతరం బీసీసీ 19.4.ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 127 చేసి విజయం సాధించారు.

## వీరవాసరం పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ బి.శ్రీనాథ్

వీరవాసరం, జనవరి 11 : వార్షిక తనిఖీలలో భాగంగా వీరవాసరం పోలీస్‌స్టేషన్‌ను భీమ వరం డీఎస్పీ బి.శ్రీనాథ్ గురువారం రాత్రి తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలి ంచారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, జూదాలు, అసాంఘీక కార్యక్రమాలు నృత్యాలు నివారణకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను ప్రశ్నించారు. క్రైమ్ రేటును పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. పెండింగ్ కేసులకు సంబంధించి సూచనలు ఇచ్చారు. ఆయనతోపాటు సీఐ సత్యకిషోర్, ఎస్‌ఐ పి.రమేశ్ ఉన్నారు.



భీమవరం జంక్షన్ రైల్వేస్టేషన్ వద్ద దీక్షలు చేస్తున్న రైల్వే ఉద్యోగులు

## రైల్వే ఉద్యోగుల ఆందోళన

భీమవరం క్రైం, జనవరి 11 : రైల్వే ఉద్యోగులకు నష్టం కలిగించే కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతినే అమలు చేయాలని ఎంప్లాయిస్ సంఘ్ భీమవరం బ్రాంచ్ కార్యదర్శి సంధి విజయకుమార్ డిమాండ్ చేశారు. భీమవరం జంక్షన్ రైల్వేస్టేషన్ ఎదుట గురువారం రైల్వే ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్ నగదును షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడంతో ఉద్యోగికి భద్రత లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పదవీ విరమణ తరువాత ఉద్యోగి కుటుంబ సభ్యులకు పింఛనే ఆధారమన్నారు. ట్రెజరర్ బొంతు శ్రీకాంత్ మాట్లాడుతూ పాత పింఛన్ అమలు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

## పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహం



పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహక బహుమతులు అందచేస్తున్న దృశ్యం

పోడూరు, జనవరి 11: పెరుగుతున్న జనాభా దృష్ట్యా పాల ఉత్పత్తులు పెంచేందుకు విశాఖ డైరీ పాల ఉత్పత్తిదారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నదని విశాఖ డైరీ జిల్లా కార్యనిర్వాహణాధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. పెనుమదం పాల ఉత్పత్తిదారుల సంఘంలోని 120మందికి విశాఖ డైరీ గురువారం పశువుల దాణా, దాణా గిన్నెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు పి.సత్యనారాయణ, ఆచంట ఏరియా పర్యవేక్షణాధికారి కె.పరమేశ్వరరావు, సంఘ అధ్యక్షుడు దిడ్ల రాజాబాబు పాల్గొన్నారు.

## లాల్‌బహదూర్ శాస్త్రికి ఘన నివాళి

పెంటపాడు, జనవరి 11: మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. లాల్ బహదూర్‌శాస్త్రి వర్ధంతిని గురువారం లాల్ బహదూర్ శాస్త్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోస్టుబేసిక్ పాఠశాలలో నిర్వహించారు. పాబోలు వెంకటేశ్వరరావు, బీ విశ్వనాధం, పులపర్తి మల్లికార్జునరావు, ఎన్‌వీఎస్ జనార్ధనరావు, ఎం.హనుమంతురావు పాల్గొన్నారు.

**మొగల్తూరు:** లాల్‌బహదూర్ శాస్త్రిని ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ముత్యాలపల్లి ఆరోగ్యవర్షిణీ సంస్థ కార్యదర్శి నాగిడి రాంబాబు అన్నారు. గురువారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ప్రాథమిక పాఠశాలలో శాస్త్రి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

## పూర్వ విద్యార్థుల కలయిక



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 11: పెంటపాడు గోయెంకా డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1980-83 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు కుటుంబసమేతంగా విచ్చేసి గత స్మృతులను నెమరువేసుకున్నారు. తరగతి గదులు కలియతిరుగుతూ నాలుగు దశాబ్దాల నాటి అల్లరి చేష్టలను జ్ఞప్తికి తెచ్చుకుని నవ్వుకున్నారు. మనువళ్లతో సరదాగా ఆడుతూ పాడుతూ గడిపారు. మృతి చెందిన స్నేహితల ఆత్మకు శ్రద్ధాంజలి ఘటించారు. తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి వేదికగా నిలిచింది. బడేటి నాగేశ్వరావు, వీర్ల వేణుగోపాల్, మద్దుల మల్లేశ్వరరావు, దంగేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు ‘గణిత దీక్ష’

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 11 : పశ్చిమ గోదావరి జిల్లాలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మార్చిలో జరుగు పబ్లిక్ పరీక్షల్లో గణితంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా 'గణిత దీక్ష' అనే మెటీరియల్‌ను జిల్లా కలెక్టర్ అనుమతితో తయారు చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ విద్యార్థి సులభంగా 60 మార్కులు తెచ్చుకునే విధంగా బొమ్మలు, ముఖ్యమైన సమస్యల పరిష్కారాలతో సహా వివరించడం జరిగిందన్నారు. సదరు మెటీరియల్ జిల్లాలో ప్రతీ విద్యార్థికి సంబంధిత ప్రధానోపాధ్యాయులు ద్వారా అందేలా చూడాలన్నారు. ఈ మెటీరియల్‌ను జిల్లా ప్రధానోపాధ్యాయులు వాట్సాప్ గ్రూప్‌లో పొందుపరచడం జరిగిందని తెలిపారు.

# తగ్గేదేలే..

**అధికారులు అందించిన నోటీసులు దహనం చేసిన అంగన్‌వాడీలు**



ఆకివీడులో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

ఆకివీడు/నరసాపురం/తణుకు/వీరవాసరం/భీమవరం అర్బన్/ఆచంట/పెనుగొండ/మొగల్తూరు/ ఉండి, జనవరి 11: ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ అన్నారు. 31వ రోజు సమ్మెలో భాగంగా గురువారం ఆకివీడులో అంగన్వాడీలతో ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. జీతాలు పెంపు కోసం చేస్తున్నది సమ్మెకాదని ధర్మయుద్ధమన్నారు. ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలకు పోస్టు ద్వారా నోటీసులు పంపించడంతో పాటు సెంటర్లకు, ఇళ్ళకు అంటించడం జరిగిందని అధికారి వాణి విజయరత్నం తెలిపారు. ఉండి, పాలకోడేరు, ఆకివీడు మండలాల్లో 11 సెంటర్లలో అంగన్వాడీలు పనిచేస్తున్నారన్నారు. మిగిలిన సెంటర్లలో సచివాలయ సిబ్బందితో నడిపిస్తున్నామన్నారు. నరసాపురంలో దీక్షలకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. భీమవరం, తణుకు, ఉండిలలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. వీరవాసరంలో రెండురోజులుగా అంగన్వాడీలు, సహాయకులకు ఐసీడీఎస్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నోటీసులతో నాలుక గీసుకుంటూ నిరసన తెలిపారు. గురువారం వీరవాసరం బస్టాండ్‌సెంటర్‌లో మండలస్థాయిలో నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద నోటీసులతో నిరసన తెలిపారు.



ఆకివీడులో అంగన్వాడీ సెంటర్‌కు అంటించిన నోటీసులు

ఆచంటలోని కచేరి సెంటర్‌లో అంగన్‌వాడీలు గడ్డి నోట్లో పెట్టుకుని నిరసన తెలిపారు. పెనుగొండలో అధికారులు అందించిన నోటీసులను దహనం చేశారు. మొగల్తూరులో అంగన్‌వాడీల దీక్షలకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొమ్మిడి నాయకర్ సంఘీభావం తెలిపారు.





కూడారై పూజ సందర్భంగా శంకు, చక్రం, నామం ఆకృతులు పత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

## కాళ్ళకూరు వెంకన్న సన్నిధిలో కూడారై పూజ

కాళ్ల, జనవరి 11 : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధర్మాసనం ఉత్సవాల్లో భాగంగా గురువారం కూడారై పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కూడారై అక్కరసు (పాయసం) ప్రసాదాన్ని తయారు చేసి 1300 గిన్నెలతో స్వామి, అమ్మవార్లకు నివేదించారు. అర్చకులు పంచారాత్ర ఆగమం శ్రీవైష్ణవ సాంప్రదాయంలో పాశురములు, గానం చేసినారు. దేవాలయంలోని పలు రకాల పుష్పాలతో శంఖు, చక్రం, నామములతో అలంకరణలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో భీమవరం పద్మావతి వేంకటేశ్వరస్వామి ట్రస్ట్ చిన్నారులచే కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. యతిరాజుల ఆండాళ్ గోష్ఠి వారు గోదాదేవికి చీర, సారె సమర్పించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఈవో మోకా అరుణ్‌కుమార్ పర్యవేక్షించారు.

### భీమవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో...

భీమవరంటౌన్, జనవరి 11 : హౌసింగ్ బోర్డుకాలనీలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి కూడారై ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీవారి భక్తులచే విశేష పాయస ప్రసాదం ఇత్తడి పాత్రలతో స్వామివారికి ఆరగింపు సేవ నిర్వహించారు.

### రాజగోపాలస్వామి ఆలయంలో...

**మొగల్తూరు:** ధనుర్మాసాన్ని పురస్కరించుకొని రుక్మిణీ సత్యభామా సమేత శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో గురువారం గోదా సహిత రంగనాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 27 పాశురాన్ని పఠించి 108 గంగాళాలతో క్షీరాన్నాన్ని రంగనాయకస్వామికి గోదాదేవికి నివేదించి స్వామివారిని ప్రసన్నం చేసుకున్న ఘటాన్ని నిర్వహించారు.

## శరవేగంగా ఆలయ పునర్నిర్మాణ పనులు

కాళ్ల, జనవరి 11 : కలవపూడి గ్రామంలో సుమారు 60 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ ఉమాభీమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈపనులను గురువారం గ్రామ పెద్దలు పర్యవేక్షించారు. దేవాలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు, దాతలు సహకారంతో ఆలయ నిర్మాణానికి పూనుకున్నట్లు వారు తెలిపారు. సుమారు రూ.2 కోట్లతో ఆలయ నిర్మాణాన్ని అత్యంత సుందరంగా నిర్మిస్తున్నట్టు వారు తెలిపారు.

## మానవత సేవలు భేష్: ఎమ్మెల్యే నిమ్మల



దుస్తులు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామానాయుడు

పాలకొల్లు, జనవరి 11: పాలకొల్లు మానవత సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే వైద్య, విద్యతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణ కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్లో గురువారం మానవత డైరెక్టర్ కామిశెట్టి అయ్యప్పస్వామి నాయుడు అందచేసిన రూ.25వేలతో ఎయిడ్స్ బాధిత పిల్లలకు నూతన దుస్తులు ఎమ్మెల్యే రామానాయుడు చేతుల మీదుగా అందజేశారు. సంస్థ తరుపున అయ్యప్పస్వామి నాయుడును శాలువా కప్పి ఎమ్మెల్యే నిమ్మల సత్కరించారు. మానవత అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ నెలా క్రమం తప్పకుండా ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం, ఇతర సేవలు చేస్తున్నామంటే దాతలు ముందుకు రావడమేనని అన్నారు. కార్యక్రమంలో మానవతా కన్వీనర్ ముత్యాల రామారావు, కోశాధికారి మద్దాల వాసు, డైరెక్టర్ కొమ్ముల మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ ఇంటి శివరాం గోపాల్ పాల్గొన్నారు.

## రైలు కింద పడి వృద్ధుడి మృతి

పాలకొల్లు టౌన్, జనవరి 11: పాలకొల్లు పట్టణ రైల్వేస్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్ శివారు ప్రాంతంలో ఉల్లి రామారావు(70) అనే వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. గురువారం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొల్లులోని ఎల్ఆర్ పేట 5వ వీధిలో నివాసం ఉంటున్న రామారావు భార్య ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందింది. ఇతనికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య మృతి చెందిన నుంచీ మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. రాత్రి సుమారు 7గంటల సమయంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించామని పోలీ సులు తెలిపారు. భీమవరం రైల్వే ఎస్ఐ టిటివి.రమణ ఆధ్వర్యంలో నరసాపురం కానిస్టేబుల్ వి.బ్రహ్మానందరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**యలమంచిలి:** ఇదిలావుండగా మృతుడు రామారావు గురువారం ఉదయం తొలుత చించినాడ బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకడానికి రెయిలింగ్ ఎక్కుతుండగా సమీపంలోని చెక్‌పోస్ట్ వద్ద ఉన్న ఎస్ఐ కె.శివన్నారాయణ గమనించి వెంటనే సిబ్బందితో కలిసివెళ్లి వృద్ధుడిని పట్టుకున్నారు. రామారావును పోలీస్‌స్టేషన్‌కు తరలించి అల్పాహారం, తాగునీరు అందించారు. అనంతరం అతని వివరాలు అడిగి తెలుసుకుని అతని కుటుంబసభ్యులకు అప్పగించారు. రామారావు కొడుకుతో మనస్పర్థల కారణంగా గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించినట్లు ఎస్ఐ తెలిపారు.



చించినాడ బ్రిడ్జి వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడిని కాపాడిన పోలీసులు

## అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత

యలమంచిలి, జనవరి 11: చించినాడ బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై గురువారం అక్రమంగా రవాణా చేస్తున్న 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం లారీని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. మచిలీపట్నంలోని రైస్‌మిల్లు నుంచి 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీ యజమాని, డ్రైవర్ షేక్ కదీర్‌పై కేసు నమోదు చేసి బియ్యం, లారీని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

## నూనెలో పడిన మహిళ

యలమంచిలి, జనవరి 11: చించినాడ గ్రామానికి చెందిన మేడిచర్ల దుర్గాభవాని తన ఇంటి ఆవరణలో గురువారం పిండివంటలు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాగుతున్న నూనెలో పడిపోవడంతో కాలిన గాయాలయ్యాయి. దీంతో ఆమె కుటుంబసభ్యులు వెంటనే పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.శివన్నారయణ తెలిపారు.

## ఎరువుల షాపుల్లో తనిఖీలు

పెనుమంట్ర, జనవరి 11 : నత్తారామేశ్వరం, ఆలమూరు, మల్లిపూడి గ్రామాల్లోని ఎరువుల షాపులను తాడేపల్లి ఏడీఏ పి.మురళీకృష్ణ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. రైతులకు బిల్లుల లేకుండా ఎరువులు అమ్మవద్దని హెచ్చరించారు. ఎంఆర్‌పీకి మించి అమ్మకూడదన్నారు. ఆయన వెంట మండల అధికారి వై.రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.